


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 21-09-2026 | సంపుటి - 31 | సంచిక - 119 | రూ : 4 | పేజీలు: 8



అక్రమాలకు 'ఆధారం' కావొద్దు..!

- వ్యక్తిగత డేటా కొల్లగొట్టి ఆర్థిక మోసాలు చేస్తున్న కేటుగాళ్లు
- డొల్ల కంపెనీలు సృష్టించి పన్ను ఎగవేత, ఐటీసీ క్లెయిమ్‌లు
- గుర్తింపు పత్రాలు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిందే

హైదరాబాద్: రుణం కోసం బ్యాంకు ఏజెంటును సంప్రదిస్తే వ్యక్తిగత ధ్రువీకరణ కోసం ఆధార్, పాన్ కార్డు వాట్సప్‌లో పంపమంటారు. ఎక్కడైనా హోటల్‌లో బస చేయాలంటే వ్యక్తిగత గుర్తింపు ఇవ్వాల్సిందే. పాన్ బ్రోకర్లు, మీసేవ కేంద్రాల వద్ద గుర్తింపు పత్రాల జిరాక్సులు ఇచ్చేస్తాం. కొందరు మాయగాళ్లు వీటి నకళ్లు, డిజిటల్ కాపీలు కొట్టేసి భారీ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. కొత్తగా నకిలీ కంపెనీలు ఏర్పాటుచేసి.. జీఎస్టీలో రిజిస్ట్రేషన్ చేసి రూ.వందల కోట్ల మోసాలకు పాల్పడుతున్నారు. మోసగాళ్లు దర్జాగా తప్పించుకుంటుండగా.. అసలు నేరంతో సంబంధంలేని బాధితులు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. తరువాయి 2లో

దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర కాంగ్రెస్‌దే...

- ఆ భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తాం
- విషప్రచారాన్ని నమ్మొద్దు : రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్ : దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పునరుద్ఘాటించారు. పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు. తరువాయి 2లో



ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు..
పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ

- ఏపీలో కొత్త రైల్వే లైన్లు ఏర్పాటుకు రైల్వే శాఖ సన్నాహాలు
- పశ్చిమ, మధ్య భారతం నుంచి ఏపీ పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ లక్ష్యం
- రాయలసీమ నుంచి పోర్టులకు దూరం తగ్గించేలా కీలక ప్రతిపాదనలు
- తెలంగాణ నుంచి శ్రీశైలానికి రైలు మార్గం ఏర్పాటుకు ప్లాన్
- ప్రయాణ సమయం, సరుకు రవాణా ఖర్చులు తగ్గించడమే ప్రధాన ఉద్దేశం



తెలంగాణకు భారీ వర్ష సూచన..
మూడు రోజులు అప్రమత్తం

- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన
- రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం
- సోమవారానికి వాయుగుండంగా, మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్న అల్పపీడనం
- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
- సెప్టెంబర్ 24న పలు జిల్లాల్లో అతి భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక 2లో

సూర్యాపేటలో ఘోర ప్రమాదం
కారులో సజీవదహనమైన వైద్యుడు

- డివైడర్‌ను ఢీకొట్టి కారులో చెలరేగిన మంటలు
- ఖమ్మం న్యూరో సర్జన్ కాసకుర్తి జగదీశ్ సజీవదహనం
- తలుపులు లాక్ అవ్వడంతో బయటకు రాలేకపోయిన వైద్యుడు

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవ దహనమయ్యారు. తరువాయి 2లో





రియాద్‌పై హౌతీల దాడి..
సౌదీలో తీవ్ర ఉద్రిక్తత!

- సౌదీ రాజధాని రియాద్‌పై హౌతీ రెబల్స్ బాలిస్టిక్ క్షిపణితో దాడి
- రియాద్‌లోని విమానాశ్రయం సమీపంలోని అరామ్కో ఇంధన డిపోలో చెలరేగిన మంటలు
- దాడిని విజయవంతంగా అడ్డుకున్నామని ప్రకటించిన సౌదీ సంకీర్ణ దళాలు
- రియాద్, యాన్బులోని కీలక ప్రాంతాలపై దాడులు చేశామన్న హౌతీలు
- యెమెన్‌లో ఘర్షణలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించిన అమెరికా

యెమెన్‌లో భీకర పోరు..
24 గంటల్లో 44 మంది మృతి

- యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీల మధ్య భీకర పోరు
- తాయిజ్, లహజ్ ప్రావిన్స్‌ల్లో కొనసాగుతున్న ఘర్షణలు
- వ్యూహాత్మక ప్రాంతాలకు బలగాలను తరలిస్తున్న ఇరు పక్షాలు



సరిహద్దులు దాటిన స్వచ్ఛత
ఘనాలో భారతీయుల శ్రమదానం

- ఘనాలో 'స్వచ్ఛతా హి సేవ' ప్రచారంలో భాగంగా భారత హైకమిషన్ కార్యక్రమం
- అనన్సే బీచ్‌లో టన్నుల కొద్దీ వ్యర్థాలను తొలగించిన వందలాది మంది వాలంటీర్లు
- పర్యావరణ పరిరక్షణలో సామూహిక బాధ్యతను చాటిన కార్యక్రమం



ఒకే దేశం గడ్డపై సైతం భారత్ తన 'స్వచ్ఛతా హి సేవ' స్ఫూర్తిని చాటిచెప్పింది. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఘనాలోని భారత హైకమిషన్ ఆధ్వర్యంలో శనివారం భారీ బీచ్ క్లీనింగ్ (తీర ప్రాంత పరిశుభ్రత) కార్యక్రమాన్ని నిర్వహించారు. నుంగువాలోని అనన్సే బీచ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పందలాది మంది వాలంటీర్లు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత హైకమిషన్ అధికారులు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు, ప్రవాస భారతీయులతో కూడిన వాలంటీర్లు తీరప్రాంతంలో పేరుకుపోయిన టన్నుల కొద్దీ వ్యర్థాలను తొలగించారు. దీంతో అనన్సే బీచ్ పరిశుభ్రంగా, తరువాయి 2లో

అక్రమాలకు 'ఆధారం' కావొద్దు!

హైదరాబాద్: రుణం కోసం బ్యాంకు ఏజెంటును సంప్రదిస్తే వ్యక్తిగత ధ్రువీకరణ కోసం ఆధార్, పాన్ కార్డు వాట్సప్‌లో పంపమంటారు. ఎక్కడైనా హోటల్‌లో బస చేయాలంటే వ్యక్తిగత గుర్తింపు ఇవ్వాల్సిందే. పాన్ బ్రోకర్లు, మీసేవ కేంద్రాల వద్ద గుర్తింపు పత్రాల జిరాక్సులు ఇచ్చేస్తాం. కొందరు మాయగాళ్లు వీటి నకళ్లు, డిజిటల్ కాపీలు కొట్టేసి భారీ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. కొత్తగా నకిలీ కంపెనీలు ఏర్పాటుచేసి.. జీఎస్టీలో రిజిస్ట్రేషన్ చేసి రూ.వందల కోట్ల మోసాలకు పాల్పడుతున్నారు. మోసగాళ్లు దర్జాగా తప్పించుకుంటుండగా.. అసలు నేరంతో సంబంధంలేని బాధితులు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మీసేవ, జిరాక్సు సెంటర్ల దగ్గర గుర్తింపు కార్డుల చౌర్యం జరుగుతోంది. వీటిని చేజిక్కించుకుంటున్న నేరగాళ్లు అడ్డగోలు పనులకు వాడుతున్నారు. ప్రధానంగా జీఎస్టీలో రిజిస్ట్రేషన్ విధానంలో కొన్ని లోపాలు కారణమవుతున్నాయి. ఆధార్, పాన్ ఆధారంగా తేలికగా రిజిస్ట్రేషన్ చేసే అవకాశముంది. దీన్ని అనుకూలంగా మార్చుకుంటున్న నేరగాళ్లు ఇతరుల పత్రాలతో జీఎస్టీఐఎన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. కొందరు నకిలీ కంపెనీలు సృష్టించి పన్ను ఎగవేత కోసం వీటిని ఉపయోగిస్తుండగా.. ఇంకొందరు రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నట్లు నకిలీ రసీదులు సృష్టించి ఐటీసీ క్లెయిమ్ చేస్తున్నారు. ఈ లోపాలన్నీ జీఎస్టీ అధికారులు తనిఖీ చేసినప్పుడు లేదా ఆధార్, పాన్ కార్డుదారులకు అధికారుల నుంచి నోటీసులు వెళ్లినప్పుడు బయటపడుతున్నాయి. ఈ ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 20 కేసులు నమోదయ్యాయి.

షేర్ చేయొద్దు... సంతకం చేసివ్వండి

ఆధార్, పాన్, ఇతర గుర్తింపు పత్రాలు వాట్సప్, టెలిగ్రామ్ ద్వారా షేర్ చేయొద్దు.

జిరాక్స్ పత్రాలు ఎవరికైనా ఇవ్వాలంటే ఏ అవసరం కోసమో, వాటిపై తేదీతో సహా రాసి సంతకం చేయాలి.

ఆధార్ కార్డు ద్వారా మీ వేలిముద్రలు దుర్వినియోగం చేయకుండా యూఐఏడీఐ వెబ్‌సైట్ లేదా ఎంఆధార్ యాప్ ద్వారా బయోమెట్రిక్స్ లాక్ చేయాలి.

ఎవరికైనా ఆధార్ ఇవ్వాల్సి వస్తే కార్డులోని చివరి నాలుగంకెలు కనిపించే మాస్క్‌డ్ ఆధార్ డౌన్‌లోడ్ చేసుకుని వాడొచ్చు.

మీ గుర్తింపు పత్రాలను దుర్వినియోగం చేస్తే 1930 టోల్‌ఫ్రీ నంబరు, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ వెబ్‌సైట్లో లేదా పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేయాలి.

తనిఖీ... పరిశీలనే శ్రీరామరక్ష

పాన్ కార్డు ఉపయోగించి రుణం తీసుకున్నట్లు అనుమానముంటే సిబిల్ క్రెడిట్ బ్యూరోల నుంచి క్రెడ్ రిపోర్టు తనిఖీ చేసుకోవచ్చు.

మై ఆధార్ పోర్టల్‌లో లాగిన్ అయ్యి మీ ఆధార్ కార్డును గతంలో ఎక్కడ ఎందుకోసం ఉపయోగించారో తనిఖీ చేసుకోవచ్చు.

మీరు ఏటా ఐటీ రిటర్నులు ఫైల్ చేస్తుంటే.. ఇన్‌కంట్యాక్స్ ఈ ఫైలింగ్ పోర్టల్‌లో మీ ఖాతాలోకి లాగిన్ అవ్వాలి.

మీ పాన్‌కార్డు ద్వారా ఏవైనా వ్యాపారాలు, పన్ను చెల్లింపులు చేస్తున్నారేమో యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చు.

ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు.. పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించే లక్ష్యంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానిస్తూ, ముఖ్యంగా ప్రధాన ఓడరేవులను కలుపుతూ మొత్తం 9 కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. మధ్య, పశ్చిమ భారతదేశంలోని తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులకు నేరుగా కనెక్టివిటీని పెంచడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల ప్రయాణ దూరంతో పాటు సరుకు రవాణా వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది. రాయలసీమ, దక్షిణ ప్రాంతాల నుంచి ఓడరేవులకు అనుసంధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 120 కిలోమీటర్ల పొడవైన రాజంపేట నెల్లూరు రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. ఇది రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు నేరుగా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. అలాగే, 41.5 కిలోమీటర్ల మేర గూడూరు దుగరాజపట్నం పోర్టు లైన్‌కు సంబంధించి తుది లొకేషన్ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. 88.3 కిలోమీటర్ల పుత్తూరు అత్తిపట్టు మార్గం చెన్నై ఓడరేవులకు దూరాన్ని తగ్గిస్తుండగా, దీనికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం సిద్ధమవుతోంది. ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల కనెక్టివిటీకి కూడా రైల్వే శాఖ ప్రాధాన్యమిచ్చింది. 150 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన చింతూరు సామర్లకోట రైల్వే లైన్ ద్వారా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కాకినాడ పోర్టుతో నేరుగా సంబంధం ఏర్పడుతుంది. అదేవిధంగా, ఇప్పటికే మంజూరైన ఒడిశాలోని తెరుబాలి గుణుపూర్ (73.6 కి.మీ) లైన్ ములపేట పోర్టుకు సరుకు రవాణాను మరింత సులభతరం చేయనుంది. వీటితో పాటు, తెలంగాణ నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రైలు మార్గాన్ని అందుబాటులోకి తెచ్చేలా 290 కిలోమీటర్ల పొడవైన సికింద్రాబాద్ శ్రీశైలం మార్కాపురం లైన్ కూడా ప్రతిపాదనల్లో ఉంది. గద్వాల మాచర్ల (184.2 కి.మీ), దొనకొండ ఒంగోలు (119.6 కి.మీ), దూపాడు బేతంచెర్ల (53.9 కి.మీ) లైన్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మార్గాలు దొనకొండ, ఓర్వకల్ పారిశ్రామిక ప్రాంతాలను ఓడరేవులతో అనుసంధానిస్తాయి. ఈ ప్రాజెక్టులు పట్టాలెక్కితే రాష్ట్ర వాణిజ్య, ఆర్థిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతాయని భావిస్తున్నారు.

దళితుల భూమి ఒక్క అంగుళం తీసుకోం

హైదరాబాద్ : దళిత, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజా ప్రభుత్వ విధానం కాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దళితులకు సంబంధించిన అంగుళం భూమిని కూడా ప్రభుత్వం తీసుకోబోదని భరోసా ఇచ్చారు. దళితుల భూములకు ప్రజా ప్రభుత్వం సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పునరుద్ఘాటించారు. పేదలు, దళితులు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఎన్నో చారిత్రాత్మక మైన నిర్ణయాలను తీసుకుందని గుర్తు చేశారు. భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూమిలేని దళితులకు భూములిచ్చి ఆ భూమిపై హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో దళితులకు సుమారు 25 లక్షల ఎకరాల భూపంపిణీ, సుమారు రెండు లక్షల ఎకరాల పోడు భూములపై గిరిజనులకు హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేనని తెలిపారు.

భూమిలేని పేదలకు హక్కులు కల్పించాం

భూమిలేని పేదలకు భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని విమర్శించారు. 'దళితులకు సంబంధించిన ఒక అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూమిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది' మంత్రి భరోసా ఇచ్చారు. భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లాక్కోవడానికి చేస్తున్న చర్యలుగా చూడటం సరికాదని స్పష్టం చేశారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. భూముల రీసర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హక్కులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో దశాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూపించామని వివరించారు. భూమిపై హక్కులు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దళితుల భూముల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ... విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని

సూర్యాపేటలో ఘోర ప్రమాదం

కారులో సజీవదహనమైన వైద్యుడు

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లలమర్రి శివారులోని హైదరాబాద్‌ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి. దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణకు భారీ వర్ష సూచన..

మూడు రోజులు అప్రమత్తం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమవాయవ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్ దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 5060 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రియాద్‌పై హౌతీల దాడి.. సౌదీలో తీవ్ర ఉద్రిక్తత!

సౌదీ అరేబియా రాజధాని రియాద్ క్షిపణుల మోతతో దద్దరిల్లింది. యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ రెబల్స్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ప్రకటించాయి. అయితే, ఈ దాడి కారణంగా రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉన్న సౌదీ ఆయిల్ దిగ్గజం అరామ్కోకు చెందిన ఇంధన డిపోలో భారీ అగ్నిప్రమాదం సంభవించడం తీవ్ర కలకలం రేపింది. ఎయిర్‌పోర్ట్ సమీపంలో దట్టమైన నల్లటి పొగలు కమ్ముకున్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. హౌతీ ఉగ్రవాద మిలీషియా రియాద్ నగరాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణిని తమ వాయుసేన విజయవంతంగా అడ్డుకుని ధ్వంసం చేసిందని సంకీర్ణ దళాల ప్రతినిధి తుర్కీ అల్‌మల్కీ తెలిపారు. కేవలం రియాద్‌నే కాకుండా బిషా, తైఫ్, ఫరాసన్, యాన్బు నగరాల్లోని పౌర ప్రాంతాలను కూడా హౌతీలు లక్ష్యంగా చేసుకున్నారని, ఆ దాడులను కూడా తమ గగనతల రక్షణ వ్యవస్థలు విఫలం చేశాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఈ దాడులను హౌతీ రెబల్స్ ధ్రువీకరించారు. సౌదీ దాడులకు ప్రతీకారంగానే తాము ఈ సైనిక చర్యలు చేపట్టామని హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సరీ తెలిపారు. పెద్ద సంఖ్యలో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్‌లతో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించామని, రియాద్‌లోని సున్నితమైన ప్రాంతాలతో పాటు యాన్బులోని అరామ్కో సౌకర్యాలను లక్ష్యంగా చేసుకున్నామని ఆయన టెలిగ్రామ్‌లో వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో రియాద్ నగరవాసులకు 'వైమానిక దాడి ముప్పు' హెచ్చరికలు అందాయి. ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. కాసేపటికే భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని, కిటికీలు కంపించాయని స్థానికులు మీడియాకు తెలిపారు. ఈ దాడి చాలా భయానకంగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దాడుల కారణంగా కింగ్ ఖలీద్ విమానాశ్రయంలో విమాన ప్రయాణాలకు అంతరాయం ఏర్పడిందని 'ఫ్లైట్‌రాడార్24' వెబ్ సైట్ నివేదించింది. ఇటీవల యెమెన్‌లో హౌతీ రెబల్స్ దూకుడు పెంచి అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో సౌదీ మద్దతు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఈ ఘర్షణలు వేగంగా పెరిగే ప్రమాదం ఉందని అమెరికా హెచ్చరిక జారీ చేసింది. ఇదిలా ఉంటే.. గతవారం హౌతీలపై దాడి చేయాలన్న సౌదీ అభ్యర్థనను అమెరికా తిరస్కరించిందని వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, సౌదీకి రక్షణ కల్పించేందుకు 24.3 బిలియన్ డాలర్ల విలువైన 48 F35 యుద్ధ విమానాల అమ్మకానికి వాషింగ్టన్ ఆమోదం తెలిపింది. 2014లో యెమెన్ రాజధాని సనాతో పాటు ఇతర ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకోవడంతో అక్కడ అంతర్యుద్ధం మొదలైంది. 2015లో సౌదీ అరేబియా సైనిక జోక్యం చేసుకుంది. 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం జులైలో విఫలమవడంతో ఘర్షణలు మళ్లీ తీవ్రమయ్యాయి. ఈ పోరాటం వల్ల 1,12,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. ఇరుపక్షాలు చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని, కానీ ప్రస్తుతం దాడుల ఉచ్చులో చిక్కుకున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

యెమెన్‌లో భీకర పోరు..

24 గంటల్లో 44 మంది మృతి

యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకర పోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్‌కదా, అల్‌వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు ప్రభుత్వ సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు. మరోవైపు, లహిజ్ ప్రావిన్సులో వ్యూహాత్మకంగా కీలకమైన బాబ్ అల్‌మండెబ్ జలసంధి సమీపంలోని కహబూబ్ పర్వత ప్రాంతం స్వాధీనం కోసం జరిగిన పోరులో 12 మంది సైనికులు, ఒక కమాండర్‌తో సహా 15 మంది హౌతీ తిరుగుబాటుదారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల ఆరంభంలో హౌతీ రెబల్స్ కీలకమైన మోఖా నౌకాశ్రయంతో పాటు బాబ్ అల్‌మండెబ్ జలసంధిలోని మయూన్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు పక్షాలు ఎర్ర సముద్ర మార్గంలోని వివాదాస్పద ప్రాంతాలకు భారీగా బలగాలను తరలిస్తున్నాయి.

సరిహద్దులు దాటిన స్వచ్ఛత ఘనాలో భారతీయుల శ్రమదానం

విదేశీ గడ్డపై సైతం భారత్ తన 'స్వచ్ఛతా హి సేవ' స్ఫూర్తిని చాటిచెప్పింది. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఘనాలోని భారత హైకమిషన్ ఆధ్వర్యంలో శనివారం భారీ బీచ్ క్లీనింగ్ (తీర ప్రాంత పరిశుభ్రత) కార్యక్రమాన్ని నిర్వహించారు. నుంగువాలోని అనన్సే బీచ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది వాలంటీర్లు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత హైకమిషన్ అధికారులు, భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు, ప్రవాస భారతీయులతో కూడిన వాలంటీర్లు తీరప్రాంతంలో పేరుకుపోయిన టన్నుల కొద్దీ వ్యర్థాలను తొలగించారు. దీంతో అనన్సే బీచ్ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా మారింది. సముద్రాలు, పర్యావరణ పరిరక్షణలో సామూహిక భాగస్వామ్యం, ఉమ్మడి బాధ్యత ఎంత కీలకమో ఈ కార్యక్రమం తెలియజేసిందని భారత హైకమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. పరిశుభ్రతను పౌరుల బాధ్యతగా ప్రోత్సహించే లక్ష్యంతో భారత్ ఏటా 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కాగా, ఘనాతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత హైకమిషనర్ ఎస్. భగత్ ఇటీవల పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. ఘనా ఇండియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ చైర్మన్ క్వామెనా మింటా న్యాకు, వైస్ చైర్మన్ అలెగ్జాండర్ అక్వాసీ అక్వాలతో పార్లమెంటరీ వ్యవహారాలపై ఆయన చర్చలు జరిపారు. అలాగే, గతవారం ఘనా స్కౌట్స్ అసోసియేషన్ చీఫ్ కమిషనర్ హిలరీ వై. అవుసీతో భేటీ అయి యువత సాధికారత, విద్య, సాంస్కృతిక మార్పిడి వంటి కీలక అంశాలపై సమాలోచనలు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం: జన్నారం మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్ లో ఆదివారం రోజున ఇటీవల రాష్ట్ర,జిల్లా,మండల స్థాయి అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎస్ సి టి చైర్మన్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత శాలువా కప్పి , మెమెంటో లతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రసాద్ నేత మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు.తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పే ప్రతి మాట, చేసే ప్రతి పని విద్యార్థి జీవితంపై ప్రభావం చూపుతుందని తెలిపారు.విద్యార్థుల భవితకు,దేశ భవిష్యత్తుకు గురువే మార్గదర్శి అని కొనియాడారు. అటువంటి గురువులను సన్మానించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సన్మాన గ్రహీతలు మేజర్ ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలంగాణ యూనివర్సిటీ డాక్టర్ బోర్లకుంట రాజయ్య నేత,జిల్లా స్థాయి ఉత్తమ పాఠశాల చింతగూడ కు చెందిన కామెర శంకర్, ఉత్తమ ఉపాధ్యాయులు బాదావత్ ప్రకాష్ నాయక్ ,దుర్గం భూమన్న జాడి రాజలింగం లతో పాటు నేతకాని కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి బోర్లకుంట ప్రభుదాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి గంగాధర్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి రాజన్న, జిల్లా అధ్యక్షులు రామటంకి శ్రీనివాస్, మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకటయ్య ,నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్ సీనియర్ నాయకులు జనుగురి మల్లయ్య, దుర్గం నందయ్య అల్లూరి వినోద్ దుర్గం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ చౌరస్తాలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలోని 33వ వార్డు విద్యానగర్ గణేష్ చౌరస్తా లో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వరలక్ష్మి పూజలో 151కుటుంబాలు పాల్గొన్నారు. వినాయకుని లడ్డు ను సుధాకర్ 40,000/రూపాయలకు కలశాన్ని కృష్ణారెడ్డి 20,000/అమ్మవారి చీర ను 7000/ రూపాయలకు మోదుగు జానకమ్మ దక్కించుకున్నారు. అన్నదాన కార్యక్రమం దాతలు డాక్టర్ సునీల్ కుమార్ రాధిక, కొమ్ము వెంకటరెడ్డి రమ దంపతులు , విగ్రహ దాత గొట్టిముక్కుల శ్రీనివాసరెడ్డి కళావతి దంపతులు పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగుల వాసు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పెద్దిరెడ్డి రాజా ,ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఇండ్ల ధనమూర్తి, వుప్పల శ్రవణ్ కుమార్, వీర బ్రహ్మచారి పెద్దిరెడ్డి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా అన్నారు. ఆదివారం పట్టణం లోని నల్లాల బావి సెంటర్ లో మార్గదర్శి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల 26వ వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు పెండెం చంద్రశేఖర్, నేరెళ్ల లక్ష్మి, పెద్దిరెడ్డి కళ్యాణ్,ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు నేరెళ్ల మధు గౌడ్, అధ్యక్షులు సలిగంటి శ్రీనివాస్, కార్యదర్శి కారింగుల వేణు, విగ్రహ దాత మద్దెల శ్రీనివాస్, అన్నదాతలు,నేరెళ్ల నరేష్, పోలగాని ఉపేందర్, పర్వతం ఉపేంద్రచారి,గుణగంటి మధు,కొండా రాజేష్,పోదీల హరిరాం ప్రసాద్, కృష్ణ,మద్దెల అరవింద్, ఫణి, నేరేళ్ల యతిన్, మిథున్, సాయి కుషాల్, దొరేపల్లి సైదులు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫరూక్నగర్ లో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఫరూక్నగర్ బ్రహ్మంగారి గుడి,వివేకానంద యూత్, శివ గణేష్ యూత్ పట్టణంలోని తదితర కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ కానుగు అనంతయ్య, యుగంధర్,నందకిశోర్,చింటూ ప్రతాప్ రెడ్డి,చెట్ల నర్సిమా,పాలమకుల చెనయ్య,చిన్న యాదగిరి,సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి,మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి,బిలాల్,వీరేశం తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ గణనాథుడి సేవలో హీరో మంచు మనోజ్

* వినాయకనగర్‌లో అభిమానుల కోలాహలం!



బాలానగర్,ప్రజాస్ఫూర్తి:వినాయక చవితి పండగను పురస్కరించుకుని టాలీవుడ్ స్టార్ హీరో మంచు మనోజ్ భక్తిశ్రద్ధలతో విగ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. బాలానగర్ పరిధిలోని వినాయకనగర్‌లో వెలసిన గణనాథుడి వద్దకు చేరుకున్న ఆయన, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు.యువ హీరో మనోజ్ రాకతో వినాయకనగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన నటుడిని నేరుగా చూసేందుకు యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం ఉత్సవ నిర్వాహకులు, స్థానిక భక్తులతో కలిసి మనోజ్ కాసేపు సమయాన్ని గడిపారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు, అభిమానులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.మంచు మనోజ్ పర్యటన సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నవీన్ ఫాన్స్ అధినేత జి. నవీన్‌కుమార్ కుటుంబ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు కె. రాజు గౌడ్, ఆర్. సతీష్, ఆశిష్, ఆకుల నరేందర్. వేణు గోపాల్, రాము ముదిరాజ్, రిషి యాదవ్, ప్రభారెడ్డి, వినాయకనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాశం శ్రీనివాస్, సతీష్, గిరి, పెద్ద సంఖ్యలో స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

స్నేహితురాలి గుర్తుగా అన్నదానం

* 28 ఏళ్ల స్నేహానికి ఇదే నిదర్శనం



హత్నూర, ప్రజాస్ఫూర్తి హత్నూర మండలంలోని తుర్కలఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 1997లో పదో తరగతి చదివిన విద్యార్థిని కీ.శే. నిర్మల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్న తమ స్నేహితురాలిని మరువలేక సహ విద్యార్థులు ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వినూత్నంగా నివాళులర్పించారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు, ఆసుపత్రికి వచ్చిన రోగుల బంధువులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 28 ఏళ్లుగా కొనసాగుతున్న తమ స్నేహానికి గుర్తుగా,నిర్మల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్నేహితురాలి పేరు చిరస్థాయిగా నిలిచేలా వారు చేసిన ఈ కార్యక్రమం స్థానికంగా అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా సహ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. తమతో కలిసి చిన్ననాటి నుంచి చదువుకున్న నిర్మల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందని కన్నీటి పర్యంతమయ్యారు. “చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నాం. నిర్మల ఎప్పుడూ నవ్వుతూ, అందరితో ఆప్యాయంగా ఉండేది. ఆమె ఇక మన మధ్య లేకపోవడం ఎంతో బాధగా ఉంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె జ్ఞాపకార్థం ఏదైనా మంచి కార్యక్రమం చేయాలని భావించాం. అందుకే సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు, రోగుల బంధువులకు అన్నదానం నిర్వహించాం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెడితే మా నిర్మలకు పుణ్యం దక్కుతుందని నమ్ముతున్నాం” అని సహ విద్యార్థులు తెలిపారు. నిర్మల జ్ఞాపకార్థం సహ విద్యార్థులు చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమం వారి మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి, 28 ఏళ్ల స్నేహానికి నిదర్శనంగా నిలిచింది. కార్యక్రమంలో సహ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

63 ఏళ్లుగా కొలువుదీరిన ఒకే గణనాథుడు

* ఆరు దశాబ్దాలకు పైగా పూజలు
* నిమజ్జనంచేయకుండా భద్రపరిచి, ఏటా పునఃప్రతిష్ఠించే
* అరుదైన సంప్రదాయం



ప్రజాస్ఫూర్తి, ఖైంసా: నిర్మల్ జిల్లా తానూర్ మండలం భోసి గ్రామంలోని వరసిద్ధి వినాయకుడి ప్రత్యేకత.1963 నుంచి నేటి వరకు భోసి గ్రామస్థులు ఒకే కర్ర వినాయకుడిని ప్రతిష్ఠిస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఏటా వినాయక చవితి సందర్భంగా ఆ గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామమంతా ఒక్కటై నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకుంటారు. యువకులు, వృద్ధులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో భాగస్వాములవుతారు. తరాలు మారినా.. కాలం గడిచినా.. గణనాథుడికి గ్రామస్థులకున్న భక్తి మాత్రం చెక్కు చెదరడం లేదు. నిమజ్జనం చేయని అరుదైన సంప్రదాయం..! సాధారణంగా వినాయక నవరాత్రులు ముగిసిన అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అయితే భోసి గ్రామంలో మాత్రం ఇందుకు భిన్నమైన సంప్రదాయం కొనసాగుతోంది. ఇక్కడి కర్ర వినాయకుడిని నిమజ్జనం చేయకుండా, ఉత్సవాల చివరి రోజున అంగరంగ వైభవంగా గ్రామంలో ఊరేగిస్తారు. అనంతరం వాగు నీటిని చల్లి ప్రత్యేక గదిలో భద్రపరుస్తారు. తిరిగి వచ్చే ఏడాది వినాయక చవితి సందర్భంగా అదే విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. ఆరు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం భోసి గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. 150 ప్రభుత్వ కొలువులు.. గణనాథుడిపై అచంచల విశ్వాసం భోసి గ్రామంలో దాదాపు 150 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారనే విషయం ఇక్కడి ప్రజల్లో ప్రత్యేక చర్చకు కారణమవుతోంది. వరసిద్ధి వినాయకుడికి ఏటా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం, ఆయన ఆశీస్సులతోనే తమకు ప్రభుత్వ కొలువులు లభించాయని గ్రామస్థులు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు గణనాథుడిని దర్శించుకుని తమ ఆశయాలు నెరవేరాలని మొక్కులు చెల్లించుకుంటున్నారు.పాడిపంటలు, పరిశ్రమలు, కుటుంబాల అభివృద్ధికి ఆ గణనాథుడే అండగా నిలుస్తున్నాడని భక్తులు నమ్ముతారు. కష్టాల్లో ఉన్నవారికి ధైర్యాన్ని, ఆశయ సాధనలో ఉన్నవారికి ఆత్మవిశ్వాసాన్ని అందించే దైవంగా వరసిద్ధి వినాయకుడిని కొలుస్తున్నారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగడం తమ ఆరాధ్యదైవం అనుగ్రహంగా భావిస్తున్నారు. ఐకమత్యానికి ప్రతీకగా ఉత్సవాలు వినాయక నవరాత్రులు భోసి గ్రామంలో భక్తితో పాటు ఐకమత్యాన్ని చాటిచెబుతున్నాయి. వ్యక్తిగత విభేదాలు, వర్గపోరాటాలకు దూరంగా ఉంటూ గ్రామస్థులంతా సమష్టిగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను స్వీకరిస్తూ గణనాథుడి సేవలో భాగస్వాములవుతున్నారు. భక్తి, క్రమశిక్షణ, పరస్పర సహకారంతో సాగుతున్న ఈ ఉత్సవాలు గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అయితే ఈ భోసి వరసిద్ధి వినాయకుడి విశిష్టత గురించి తెలుసుకున్న భక్తులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలు, మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఏటా పెరుగుతున్న భక్తుల రాకతో గ్రామంలో వినాయక నవరాత్రులు ఆధ్యాత్మిక సందడిని నింపుతున్నాయి.

టిఎస్‌యూటీఎఫ్ 7వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే రాష్ట్ర మహాసభలు ఈ ఏడాది డిసెంబర్ 26,27,28 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో గల కొత్తగూడెం క్లబ్ నందు నిర్వహించనున్నారు. రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం ఆదివారం కొత్తగూడెంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు బి.మురళీమోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా టిఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ గారు పాల్గొని మాట్లాడారు. అనంతరం మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, అధ్యక్షులుగా కోనేరు పూర్ణచంద్రరావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బి రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా బి మురళీమోహన్, చీఫ్ ప్యాట్రన్‌గా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలిత కుమారి తదితరులను నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలాం వెంకట్, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గ భవాని, ఎం.రాజశేఖర్ రెడ్డి, టి.లక్ష్మీమరెడ్డి, కార్యదర్శులు రంజిత్ కుమార్, శ్రీధర్, సింహాచలం, వెంకటప్ప, రవికుమార్, సమ్మారావ్, నాగేశ్వరరావు, వెంకటేశం, భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మురళీమోహన్, ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు, సీనియర్ నాయకులు ఎసకె.దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపతి సన్నిధిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



కూకట్పల్లి,ప్రజాస్ఫూర్తి: కూకట్‌పల్లి భారతీయ జనతా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో కూకట్‌పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ బొజ్జ గణపతి స్వామివారి సన్నిధిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అన్నదాన కార్యక్రమం ప్రారంభానికి ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ హనుమంతరావు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ నాయినేని సూర్యప్రకాష్ రావు, హర్షణపల్లి సూర్యారావు, చౌదరి నర్సింగరావు, నాయినేని పద్మారావు, చౌదరి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ నగర్ లో అన్నదానం



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : లక్ష్మీదేవి పల్లి మండలం అశోక్ నగర్ గ్రామం నందు వినాయక చవితి నవరాత్రులలో భాగంగా నరేష్ ఆధ్వర్యంలో గణనాథుని సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో నవరాత్రులలో భాగంగా తొమ్మిది రోజులు గణనాథుని మండపం దగ్గర ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు . ప్రతిరోజు తన సొంత ఖర్చులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల ఆయనను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మధు, తేజ, యూసఫ్, కరుణాకర్, స్థానికులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వినాయక శోభయాత్రకు పటిష్ట భద్రతా వలయం

* జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల



ప్రజాస్ఫూర్తి, భైంసా: విఘ్నాలను తొలగించే వినాయకుడి నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధల నడుమ ప్రశాంతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. శోభాయాత్రలు సజావుగా సాగేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని జీవన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్, ముథోల్, తానూర్ మండల కేంద్రాల్లో జరిగే వినాయక నిమజ్జనోత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. శోభాయాత్ర కొనసాగే మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వినాయక శోభాయాత్ర సందర్భంగా భారీగా భక్తులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు సహకరించాలని సూచించారు. భక్తుల ఆనందోత్సాహాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం లేకుండా నిమజ్జనోత్సవాలను సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది.శోభాయాత్రలు ప్రశాంతంగా సాగేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయనున్నారు. ఈ సమావేశంలో బైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ముథోల్ సీఐ రవీందర్ నాయక్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చార్ల మణయ్య వర్ధంతి వేడుకలు



హత్నూర (ప్రజా స్ఫూర్తి) : హత్నూర మండలం లింగాపూర్ గ్రామంలో క్రీస్తుశకం చార్ల మణయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చార్ల మణయ్య సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. మణయ్య సార్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల కోసం చేసిన సేవలు, ఆయన ఆశయాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సేవ పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, యువత తదితరులు పాల్గొని చార్ల మణయ్య సార్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఆదిదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

*** మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 60ఫీట్ రోడ్డులో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు 4వ వార్షికోత్సవం సందర్భంగా నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గుణగంటి హేమసతీష్, కాంగ్రెస్ పార్టీ వార్డ్ ఇంచార్జ్ దంతాల సాయినవీన్, దంతాల వీరయ్య, నరేందర్ నాయుడు, అక్కినపల్లి జానయ్య, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, రేపాల యాదగిరి, జీడిమెట్ల రాంబాబు, విశాల్, భరత్ రెడ్డి, మహేష్, రేవంత్, నితిన్, తన్వి, వెంకట సాయి, రఘు, సాత్విక్, రోహిత్, సాయి, అక్షయ్, నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎండి షహీన్ కు నేషన్ బిల్డర్ అవార్డు ప్రధానం

*** ఆమెను అభినందించిన వాసిరెడ్డి మురళి**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : చుంచుపల్లి మండలం రాంనగర్ లో సీనియర్ సిటిజన్స్ కార్యాలయం నందు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషన్ బిల్డర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వనిర్వహించారు. అందులో భాగంగా నవభారత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు మ్యాథ్స్ టీచర్ గా పనిచేస్తున్న ఎండి షహీన్ కు నేషన్ బిల్డర్ అవార్డును అందజేశారు. ఆమెకు అవార్డు రావడం పట్ల చుంచుపల్లి సిపిఐ పార్టీ మండల కార్యదర్శి , విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి ఆమెను అభినందిస్తూ ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు అని అంటూ ఇలాంటి అవార్డులను ఎన్నో అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు . ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు సల్ల వేణు, ఎండి హలీం, ఫిజిక్స్ టీచర్ శంకర్ మహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

పులిగిల్లలో అన్న ప్రసాద కార్యక్రమం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలం పులిగిల్ల గ్రామంలో ఆదివారం రాత్రి కళ్లెం నరేష్ సహకారంతో అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద గ్రామస్తులు భక్తిశ్రద్ధలతోప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కళ్లెం నరేష్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మలుగవెంకటేశం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మారబోయిన సతీష్ ఉపాధ్యక్షుడు రాచమల్ల భాస్కర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

దశాబ్దాల ఎదురుచూపులకు అసెంబ్లీ వేదికగా దొరికిన గొంతు



బయ్యారం, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి మాట్లాడుతూ, బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాలను అందించడం వల్ల బయ్యారం మండలం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. బయ్యారం మండలంలో రెండు పంటలు పండడంతో పాటు,గార్ల,డోర్నకల్ మండలాల్లోని బీడు భూములు సైతం సాగు భూములుగా మారుతాయని తెలిపారు. అంతేకాకుండా, బీఎన్ గుప్తా ప్రాజెక్టు జలాలను తరలించడం వల్ల కుడి కాలువ ద్వారా మహబూబాబాద్ పట్టణానికి, గూడూరు మండలానికి తాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు.పాలకులు అనేక దశాబ్దాలుగా బయ్యారం పెద్ద చెరువును నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద చెరువును మీడియం ఇరిగేషన్ గా చేస్తామని హామీ ఇచ్చారని,2016లో రోళ్ళపాడు వద్ద గోదావరి జలాలను బయ్యారం చెరువుకు తరలిస్తామని శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు.కానీ, రీడిజైన్ పేరుతో ఆ ప్రాజెక్టును పక్కన పెట్టారని,దీంతో రోళ్ళపాడుకు, బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి నీళ్లు అందకుండా పోయాయని విమర్శించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ సారథి,రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్,మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో బయ్యారం పెద్ద చెరువుకు గోదావరి జలాలు ఇవ్వాలని మెమోరాండం ఇచ్చామని,అదే రోజు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించారని తెలిపారు.గోదావరి జలాలు బయ్యారం పెద్ద చెరువుకు ఇవ్వకపోతే,పార్టీ ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళనలు చేపడతామని,జలాలు వచ్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్,సారిక శ్రీనివాస్,జిల్లా అధ్యక్షురాలు నాదెండ్ల పద్మ,భూక్య హరి నాయక్,గంగరబోయిన రాజు,బండెల కళింగ రెడ్డి,మందసపు రాజు తదితరులు పాల్గొన్నారు.

కిక్స్ తో మార్మోగిన మహబూబాబాద్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: క్రీడలు, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.మార్షల్ ఆర్ట్స్ లో ప్రత్యేక గుర్తింపు పొందిన ఉషు క్రీడకు యువతలో ఆదరణ పెరుగుతోందని, తెలంగాణ రాష్ట్ర ఉషు అసోసియేషన్ కార్యదర్శి సతీష్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని షాదీఖానాలో నాలుగో అంతర్ జిల్లాల స్థాయి ఉషు క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఉషు అసోసియేషన్ కార్యదర్శి సతీష్ ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 280 మంది క్రీడాకారులు పాల్గొన్నారని,ప్రతిభ కనబరిచిన వారికి మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాల, బాలికలను అక్టోబర్ 29 నుంచి నవంబర్ 2 వరకు తమిళనాడులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.ఉషు క్రీడ కేవలం విన్యాసాలకే పరిమితం కాదని, జిమ్నాస్టిక్స్ విన్యాసాలు,కత్తి,కర్ర ఆయుధ విన్యాసాలు,కిక్స్, పంచెస్,రెజ్లింగ్ పోరాట విభాగాలు ఉంటాయని,ఇది ఏకాగ్రత,వేగం, సమయస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. ఆసియా క్రీడల్లోనూ ఉషు పోటీలు ఉన్నాయని, నైపుణ్యం సాధిస్తే డిఫెన్స్,నేవీలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉషు అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ ఉమర్,జిల్లా కార్యదర్శి సన్నఉల్లా బిన్ మహబూబ్,ఉషు సిస్టర్స్ అకాడమీ ట్రైనర్స్ సోహా తబస్సుమ్,డా. వీరన్న, కౌన్సిలర్ బీ. అజయ్ సారధి, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుపేచ్చ తపస్సుకు దక్కిన అరుదైన గౌరవం

*** దైద వెంకన్నకు బెస్ట్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మొక్కలే ఊపిరిగా, సేవే జీవితంగా బతుకుతున్న ఓ నిస్వార్థ ప్రకృతి ప్రేమికుడి 32 ఏళ్ల తపస్సుకు తగిన గుర్తింపు దక్కింది. మహబూబాబాద్ పట్టణానికి చెందిన హరితయోధుడు దైద వెంకన్న తన సేవలకు గాను ప్రతిష్టాత్మక బెస్ట్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు ను అందుకున్నారు. ఆదివారం యాదాద్రి జిల్లా, ఆత్మకూర్ లోని పి.ఎస్ ఫంక్షన్ హాల్ లో భారత్ రక్తదాన్ మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ సేవా సంస్థల ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డును వెంకన్నకు అందజేశారు.ఈ సందర్భంగా దైద వెంకన్న మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా సేవా రంగంలో ఉన్నాను.ఇప్పటివరకు 18 లక్షల మొక్కలు నాటి , వాటి సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేశాను.నేడు అవి లక్షల సంఖ్యలో వృక్షాలుగా ఎదిగి ప్రాణవాయువును పంచుతున్నాయి.ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది" అని భావోద్వేగంగా తెలిపారు. నిస్వార్థ సేవకుడికి అవార్డు దక్కడంతో జిల్లా వ్యాప్తంగా పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పర్యావరణ ప్రేమికులు వెంకన్నకు శుభాకాంక్షలు తెలిపారు.

వెయ్యి దీపాల వెలుగుల్లో గణనాథునికి నీరాజనం



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ 9వ వార్డులోని శ్రీ వినాయక కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరో రోజు కళ్యాణ్ రాజా శర్మ అయ్యగారి ఆధ్వర్యంలో కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడికి దీపాలంకరణ చేశారు. కాలనీలోని కుటుంబాలన్నీ ఒకే కుటుంబంలా ఒకే మండపం వద్దకు చేరుకుని దీపాలు వెలిగించి, మంగళహారతులతో గణపతికి నీరాజనం పలికారు. దీంతో ఆ ప్రాంతమంతా భక్తి వాతావరణం నెలకొంది.


*** 600 మందికి అన్నప్రసాదం**

ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం గణనాథుడికి మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ కమిటీతో పాటు దాతలు అందించిన వస్తు, ధన సహకారంతో సుమారు 600 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

*** గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే**

శ్రీ వినాయక కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కాలనీ చిన్నారులు, మహిళలతో ఎమ్మెల్యే ఫొటోలు దిగారు. కాలనీ కుటుంబాలన్నీ ఒకే చోట కలిసి గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృతం సతీష్‌కుమార్, కార్యదర్శి పైతరి మహేష్, గౌరవ అధ్యక్షుడు సమాల లక్ష్మారెడ్డి, కాషియర్ పసునూటి సుమన్, రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రావుల కనకయ్య, విగ్రహ దాత పవన్ కుమార్, భాస్కర్ రెడ్డి, హరీష్, కోటేశ్వరరావు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ కాలనీ గణనాథుని వద్ద సరస్వతి దేవి పూజ



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీ పంచాయతీ నందు గల గాంధీ కాలనీ లో ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రులలో భాగంగా గణనాధుని మండపం వద్ద ఆదివారం సాయంత్రం విద్యార్థులతో ప్రత్యేక సరస్వతి దేవి పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా పూజారి విద్యార్థుల తో సరస్వతి దేవి పూజలు నిర్వహించి , చిన్నారులు మంచిగా చదువుకోవాలని పూజారి ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు . ఈ కార్యక్రమంలో మండప కమిటీ సభ్యులు , మహిళలు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

తులపీ అపార్టుమెంట్ లో గణనాథుడి లడ్డూ వేలంపాట

*** రూ.50001లకు,సంధ్య కైవసం.**

*** రూ.21501లకు ప్రవీణ్ లడ్డు కైవసం.**



జగద్గిరిగుట్ట ప్రజాస్ఫూర్తి: వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని చింతల్ డివిజన్ పరిధిలోని స్టార్ హోమ్స్ గల తులపీ అపార్టుమెంట్లో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలంపాట ఆదివారం ఉత్సాహంగా సాగింది.ఈ వేలంపాటలో సంధ్య రూ.50001లకు గణనాథుడి లడ్డూను,మరో లడ్డూను ప్రవీణ్ లు రూ.21501 లకు దక్కించుకున్నారు.అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి న అనంతరం సాయంత్రం నిమజ్జోత్సవానికి తరలించారు.ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి వెంకట్,సభ్యులు బిర్రు ఆంజనేయులు,ప్రవీణ్,సాయి,కోటి,సంజయ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



ప్రజా స్ఫూర్తి,నల్గొండ : శ్రీ శ్రీ గణేష్ ఉత్సవాలలో భాగంగా నల్లగొండ పట్టణం పానగల్ రోడ్ శ్రీనగర్ కాలనీ, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం లో ప్రతిష్టించిన వినాయక మండపం వద్ద నల్లగొండ పట్టణం వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి టూ టౌన్ సిఐ ఆదిరెడ్డిలు దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం ఆవరణలో పెద్ది రమేష్ నాగలక్ష్మిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వికరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అగునూరు సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి మాడుగుల కిషన్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంధి శ్రీనివాసరెడ్డి కోశాధికారి ఎల్లంల సైదులు ,నాగరాజు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, శంకర్, రవి, భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు యువజన నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలిగించి విజయాన్ని అందించు గణపయ్య

*** ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నిఖితధీరజ్ రెడ్డి దంపతులు**



అందోలు, ప్రజా స్ఫూర్తి : విఘ్నాలను తొలగించి ప్రతి అడుగులో విజయాన్ని అందించే గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని బిఆర్ఎస్ యువ నాయకులు ధీరజ్ రెడ్డి అన్నారు. వినాయక నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడవరోజు భక్తులు గణపయ్యకు ఘనంగా పూజలు నిర్వహించారు. అందోలు మండలం లోని కన్సన్ పల్లి దుర్గా భవానీ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద నోమున్నగారి నిఖిత ధీరజ్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మాజీ సర్పంచ్ లు శేరి మాణిక్ రెడ్డి, సిహేచ్. వెంకటేశం, మన్నె యాదాగౌడ్, వార్డు సభ్యులు మాధవ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి,వెంకట్ రెడ్డి, శంకర్ రెడ్డి, వీరేశం, ప్రదీప్ రెడ్డి, పోచయ్య, శంకరయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆ గణనాథుని కరుణాకటాక్షాలు నియోజకవర్గంలోనీ ప్రజలపై ఎల్లవేళలా ఉండాలి

* ఫరూక్‌నగర్ లో పలు కాలనీల్లో పర్యటన
* ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్: షాద్‌నగర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఫరూక్‌నగర్ బ్రహ్మంగారి గుడి,వివేకానంద యూత్, శివ గణేష్ యూత్ పట్టణంలోని తదితర కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అన్నవితరణ చేశారు. అదేవిధంగా ఆయా మండపాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నవితరణ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ కానుగు అనంతయ్య, యుగంధర్,నందకిశోర్,చింటూ ప్రతాప్ రెడ్డి,చెట్ల నర్సిమా,పాలమకుల చెనయ్య,చిన్న యాదగిరి,సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి,మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి, బిలాల్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో మహిళా సర్పంచ్‌ను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

* వివరాలు వెల్లడించిన చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మహిళా సర్పంచ్‌ను వాట్సాప్ ద్వారా వేధింపులకు గురిచేసిన వ్యక్తిపై చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కత్తుల రమేష్ అనే వ్యక్తి సర్పంచ్‌కు వాట్సాప్ ద్వారా అత్యంత అవమానకరమైన మెసేజ్‌లు, ఆడియో రికార్డింగులు పంపడమే కాకుండా,ఆమె వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ బెదిరింపులకు గురిచేశారని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై బాధితురాలు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చిగురుమామిడి పోలీసులు కత్తుల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.రమేష్ పంపిన వాట్సాప్ మెసేజ్‌లు,ఆడియో రికార్డింగులతో కూడిన ఎలక్ట్రానిక్ ఆధారాలను పోలీసులు ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.పూర్తి ఆధారాల సేకరించిన అనంతరం రమేష్ పై చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై వివరించారు.

సరస్వతి పూజలో చిన్నారులు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా రామవరం శ్రీ హనుమాన్ సీతారామ శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద ఆదివారం రాత్రి సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో చిన్నారులతో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యకు అధిదేవత అయిన సరస్వతీదేవిని పూజించి, చిన్నారులు విద్యాభివృద్ధి, జ్ఞానం ప్రసాదించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మార్మోగిన గణనాథుడు

* వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని నెహ్రూ సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో,అంగరంగ వైభవంగా జరిగింది.ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు హాజరై,గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి,స్వామి వారిని దర్శించుకుని కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు,సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ప్రాణాలు పోతేనే స్పందిస్తారా..?

* డ్రైనేజీ మధ్యలో విద్యుత్ స్తంభాలు..
* అధికారుల నిర్లక్ష్యం
* అస్తవ్యస్తంగా పనులు
* కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం 15, 16 డివిజన్లలో జగదల్పూర్-విజయవాడ జాతీయ రహదారి వెంబడి చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కొరవడటంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



డ్రైనేజీ మధ్యలో విద్యుత్ స్తంభాలు

డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే పనులు కొనసాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. నిర్మాణానికి అడ్డుగా ఉన్న పచ్చని మొక్కలను తొలగిస్తున్నప్పటికీ.. డ్రైనేజీ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

గాలివానకు వంగిన స్తంభం

రామవరం ప్రధాన రహదారిలో డ్రైనేజీ నిర్మాణ ప్రాంతంలో ఉన్న ఓ విద్యుత్ స్తంభం శనివారం రాత్రి వీచిన గాలులు, కురిసిన వర్షానికి రోడ్డువైపు వంగిపోయింది. విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో ప్రమాదం మరింత పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు.

ఫిర్యాదులు చేసినా పట్టించుకోరా?*

డ్రైనేజీ నిర్మాణం మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని గతంలోనే పలువురు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. అయినా ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదం జరిగాక స్పందిస్తారా?*

ప్రాణాలు పోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించాలని కోరుతున్నారు. విద్యుత్ స్తంభాలను సురక్షితంగా తొలగించిన అనంతరం డ్రైనేజీ నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

గల్లి గల్లీలో మద్యం రోడ్డున పడుతున్న కుటుంబాలు

* వైన్స్‌లను మించిన బెల్ట్ దందా.. అధికారుల నిఘా ఏమైంది..?
* తెల్లవారుజాము నుంచే విక్రయాలు.. అర్ధరాత్రి దాటినా దందా..

ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని గ్రామాల్లో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాల బతుకులు క్రమంగా చిద్రమవుతున్నాయని మహిళలు, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండలంలో రెండు వైన్స్ దుకాణాలు ఉండగా.. గ్రామాల్లో మాత్రం గల్లీగల్లీలో ఎలాంటి అనుమతులు లేకుండా బెల్ట్ దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు, విద్యార్థులు, మహిళలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లోనూ మద్యం విక్రయాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పొద్దు లేదు.. రాత్రి లేదు ఎప్పుడు పడితే అప్పుడే?

ప్రభుత్వం నిర్ణయించిన సమయాలకు మాత్రమే మద్యం విక్రయాలు జరగాల్సి ఉండగా.. గ్రామాల్లోని బెల్ట్ దుకాణాలకు మాత్రం సమయపాలన లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామునే విక్రయాలు మొదలై. అర్ధరాత్రి దాటినా మద్యం అందుబాటులో ఉంటోందని చెబుతున్నారు. బెల్ట్ దుకాణాలతో పాటు కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఇతర షాపుల్లోనూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. వైన్స్ దుకాణాల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి గల్లీలో మద్యం దొరికే పరిస్థితి ఏర్పడటంతో యువత, కూలీలు, వ్యవసాయ కార్మికులు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీ డబ్బు మద్యం పాలే.. ఇంట్లో పిల్లల పరిస్థితి ఏంటి?

ఎండనకా.. వాననకా రోజంతా కష్టపడి సంపాదించిన కూలీ డబ్బును కుటుంబ అవసరాలకు ఉపయోగించాల్సి ఉండగా.. మద్యం కోసం ఖర్చు చేస్తున్నారని మహిళలు వాపోతున్నారు.పిల్లల చదువులు, ఇంటి సరుకులు, వైద్యం, ఇతర అవసరాలకు డబ్బులు లేక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయని చెబుతున్నారు. భర్త మద్యం కోసం డబ్బులు ఖర్చు చేయడంతో ఇంట్లో భార్యాపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరి మద్యం అలవాటు మొత్తం కుటుంబాన్ని ఆర్థికంగా,మానసికంగా దెబ్బతీస్తోందని మహిళలు కన్నీటితో చెబుతున్నారు.

మద్యం మత్తులో వాహనాలు.. బతుకులు బలే!

గ్రామాల్లో ఉదయం నుంచే మద్యం అందుబాటులో ఉండటంతో కొందరు మద్యం సేవించి వ్యవసాయ పనులకు, ఇతర పనులకు వాహనాలపై వెళ్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టుతున్నాయని మహిళలు వాపోతున్నారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందితే ఆ కుటుంబం పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. మద్యం విక్రయాలు కేవలం ఒక వ్యాపార సమస్య కాదని. కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేసే సామాజిక సమస్య అని ప్రజలు అంటున్నారు.

అధికారులు చూస్తున్నారా.. లేక చూడనట్టుగా నటిస్తున్నారా?

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఎక్కడున్నాయో స్థానికులకు తెలిసినంత స్పష్టంగా సంబంధిత అధికారులకు తెలియదా? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. గల్లీగల్లీలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ ఎక్సైజ్, పోలీసు శాఖల నిఘా ఎందుకు కనిపించడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై తనిఖీలు చేయాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో ఏం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తే బెల్ట్ దుకాణాలు ఇంత బహిరంగంగా ఎలా కొనసాగుతాయని ప్రశ్నిస్తున్నారు.

చర్యలు ఎక్కడ? నిఘా ఎక్కడ?

బెల్ట్ దుకాణాలపై చర్యలు తీసుకోవాల్సిన శాఖలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా,అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు పెరుగుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతుంటే.. మరోవైపు సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అంటున్నారు.అక్రమ మద్యం విక్రయాలు

అధికారుల కళ్లకు కనిపించవా? కనిపిస్తే చర్యలు ఎందుకు ఉండవు?

అంటూ ప్రజలు నిలదీస్తున్నారు.మద్యం దందాను అరికట్టాల్సిన అధికారులు మౌనం వహిస్తే గ్రామాల్లో నిబంధనలు ఎవరి కోసం అనే ప్రశ్న తలెత్తుతోంది.

మామూళ్ల ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

బెల్ట్ దుకాణాలు ఇంత విచ్చలవిడిగా కొనసాగడానికి ఎవరి అండ ఉందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామాల్లో మామూళ్ల వ్యవహారాలపై గుసగుసలు వినిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.దీనిపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలకు ఆధారం లేకుంటే బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి తమ నిఘా వ్యవస్థ సమర్థతను నిరూపించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇప్పటికైనా కళ్లుతెరవాలి..

మండలంలోని ప్రతి గ్రామంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.కేవలం ఒక్కరోజు దాడులతో సరిపెట్టకుండా నిరంతర నిఘా పెట్టాలని కోరుతున్నారు. గ్రామాల్లో మద్యం అందుబాటును తగ్గించి యువతను, కూలీలను, పేద కుటుంబాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మహిళలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్లుతెరిచి..గ్రామాల్లో సాగుతున్న బెల్ట్ దందాపై ఉక్కుపాదం మోపుతారా లేక అక్రమ మద్యం విక్రయాలు ఇలాగే కొనసాగుతాయా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి కి ,రెడ్డి జాగృతి నల్లగొండ జిల్లా పక్షాన పాలాభిషేకం

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : తెలంగాణ పోలీస్ నియామక ప్రిలిమినరీ పరీక్షల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వర్తింపచేయాలని, కట్ ఆఫ్ మార్కులు 50గా నిర్ణయించాలని రాష్ట్ర శాసనసభలో ప్రస్తావించినందుకుగాను నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరుజైవీర్‌రెడ్డికిరెడ్డిజాగృతిజిల్లా అధ్యక్షులు ఏమి రెడ్డి నర్సిరెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు . రెడ్డి జాగృతి జిల్లా పక్షాన నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్లో శాసనసభ్యులు కూందూరు జై వీర్ రెడ్డి కి ఆదివారం పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు ఈ



సందర్భంగా రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షులు ఏమిరెడ్డి నర్సిరెడ్డి రెడ్డి మాట్లాడుతూ ఈ డబుల్ ఎస్ వర్గాలకు 50 శాతం కట్ ఆఫ్ మార్కులు అమలు చేయని పరిస్థితిలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జాగృతి మహిళా అధ్యక్షురాలు జినుగు జ్యోతి రెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షులు రేగట్టే శ్రీనివాస్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు మారెడ్డి వెంకట్ రెడ్డి, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విజయ రెడ్డి ,నల్గొండ టౌన్ మహిళా అధ్యక్షురాలు గాదె పుష్పారెడ్డి,కోశాధికారి మైనంపాటి అరుణ రెడ్డి, ఏన్ రెడ్డి , జ్యోతి రెడ్డి, కృష్ణారెడ్డి రెడ్డి జాగృతి టౌన్ అధ్యక్షులు మెండు వెంకటరెడ్డి సోమిడి కరుణాకర్ రెడ్డి, స్టూడెంట్స్ శ్రీకాంత్ రెడ్డి నితిన్ రెడ్డి అక్షిత్ రెడ్డి వినయ్ రెడ్డి, సాయి రెడ్డి అధ్యయ్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మహా అన్నదాన ప్రసాదం



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి. మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామంలో రామాలయం దగ్గర ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఏడవ రోజున కేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి రవణమ్మ దంపతులు సహకారంతో మహా అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి కొబ్బరికాయ కొట్టి అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గణేష్ కమిటీ సభ్యులు కర్ణ దామోదర్ రెడ్డి, దొంగరీ శోభన్ బాబు, కర్నేరామ ,నర్సిరెడ్డి,కేతిరెడ్డిగోపిరెడ్డి,కర్నే ఓబిరెడ్డి,అద్దంకి రాంబాబు, కేతిరెడ్డి చెన్నారెడ్డి ,అంబటి మోహన్ రెడ్డి,కర్నే మోహన్ రెడ్డి ,కుందూరు వీరారెడ్డి ,కేతిరెడ్డి వెంకట్రెడ్డి, కేతిరెడ్డి నాగిరెడ్డి, కర్నే నాగిరెడ్డి, కర్నే రాజశేఖర్ రెడ్డి, వంట మాస్టర్ మలికంటి కోటేశ్వరరావు ,అంబటి సుధాకర్ రెడ్డి, కందులలక్ష్మారెడ్డి , గణేష్ భక్త మహాశయులు గ్రామ ప్రజలు మహిళలు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

గవర్నర్ చేతుల మీదుగా నగదు పురస్కారం అందుకోనున్న కిష్టాపూర్ విద్యార్థిని



ప్రజాస్ఫూర్తి , జన్నారం : గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా మొదటి ర్యాంకు సాధించిన జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న రేండ్లగూడ గ్రామానికి చెందిన విద్యార్థిని లశెట్టి శ్వేత తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా రెండు లక్షల నగదు పురస్కారం అందుకోనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న ఉపాధ్యాయులు దాముఖ కమలాకర్ తెలిపారు. శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ చేపట్టిన చదువుకో తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24వ తేదీ గురువారం రోజున హైదరాబాద్ సెంచరీ కన్వెన్షన్ సెంటర్లో జరగనున్న చదువుకో తెలంగాణ బహుమానం సమావేశంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల చేతుల మీదుగా విద్యార్థిని లశెట్టి శ్వేత ఈ నగదు పురస్కారాన్ని అందుకొనున్నట్లు తెలిపారు. నగదు పురస్కారానికి ఎంపికైన విద్యార్థిని శ్వేతను జిల్లా అదనపు కలెక్టర్ మరియు జిల్లా ఇన్చార్జి విద్యాశాఖ అధికారి పి చంద్రయ్య ఐఏఎస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, మండల విద్యాధికారి బి రాజేందర్, గ్రామ సర్పంచ్ వాసాల సరేష్, పాఠశాల ఏఏపిసి చైర్మన్ మంగ, పాఠశాల ఉపాధ్యాయులు జాడి మురళి,దాముక కమలాకర్, గోపర్ధన చారి, కొట్టే రాజన్న,బుచ్చిలింగయ్య,ప్రకాష్ బానవత్, నగేష్, మణెమ్మ,జ్యోతిశీల, అశోక్, నరహరి శర్మ, వావిలాల వాసు, కాంతయ్య, శ్రీనివాస్, రజిత రాణి, సుస్మిత, అజీమ్, స్వప్న,కృష్ణమూర్తి, రాజిరెడ్డి రాజేశ్వర్, ఆర్ శ్రీనివాస్, అనురాధ మరియు మండల ప్రజలు అభినందించారు.

వై ఎస్ సి ఎ గణేశుడి వద్ద అన్నదానం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: వలిగొండ మండల కేంద్రంలో వై ఎస్ సి ఎ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేశుడు వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు విగ్రహ దాత గంగాపురం సతీష్ కల్పన ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వలిభాష, పల్సం రాజు, కొండూరు అంజయ్య, గంగాపురం బుచ్చిబాబు, వెల్లంకి కొండలు, పబ్బు స్వామి, రచ్చ గణేష్, కొండూరు సాయి, పబ్బు వెంకన్న, కొండూరి భాస్కర్, ఆజాం, బిక్షపతి పబ్బు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంచనపల్లిలో అన్నదానం

మండల పరిధిలోని కంచనపల్లి గ్రామంలో కూడా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామానికి చెందిన జక్క సుధాకర్ రెడ్డి స్వరూప దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ముందుగా గణేశునికి గ్రామస్తులు ఘనంగా పూజలు జరిపారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ఎసిఎస్ వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు డేగల పాండరి సీనియర్ పాత్రికేయులు రాపోలు సుదర్శన్ పడమటి దామోదర్ రెడ్డి కాసుల వెంకన్న గౌడ్ గ్రంధాలయ చైర్మన్ సోమేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సి.ఐ

*** నిమజ్జన సమయంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలి సి.ఐ. రమణమూర్తి**

ప్రజాస్ఫూర్తి ,జన్నారం:జన్నారం మండలంలోని పొన్కల్ మరియు కలమడుగు గ్రామాల్లో గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన ప్రదేశాలను లక్షెట్టిపేట్ సీఐ రమణ మూర్తి జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ తోకలిసి శనివారం సంయుక్తంగా సందర్శించి పరిశీలించారు. నిమజ్జన ప్రదేశాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లు, బారికేడ్లు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్,రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలను క్షుణ్ణంగా



పరిశీలించారు. చెరువులు, కుంటల వద్ద నీటి లోతు, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తగిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా సి.ఐ రమణ మూర్తి మాట్లాడుతూ గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టిందని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు అందరూ కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. మద్యం సేవించి నిమజ్జన ప్రదేశాల వద్దకు రావద్దని సూచించారు. నిమజ్జన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు..

సుభాష్‌నగర్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గణేష్ నవరాత్రుల సందర్భంగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని సుభాష్‌నగర్ గ్రామంలో భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, గ్రామ ప్రజలకు నిర్వాహకులు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అవిరబోయిన వీరస్వామి ,నంద్యాల సత్యనారాయణ రెడ్డి, గోళ్ళ వీరస్వామి, అక్కినేపల్లి శివ, నంద్యాల వెంకట్ రెడ్డి, వీరబాబు, నాగయ్య శ్రీను, అనంతరెడ్డి, సుభాష్‌నగర్ యూత్, నిర్వాహకులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎడారి దేశం దుబాయిలో వెల్లివిరిసిన వినాయక భక్తి ఘనంగా నిమజ్జనం




ప్రజాస్ఫూర్తి ,జన్నారం: పరాయి దేశం, ఎడారి దేశం అయినప్పటికీ దుబాయిలో హిందూ సంస్కృతి,సాంప్రదాయాలను పరిరక్షిస్తూ తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (టి జి డబ్ల్యు డబ్ల్యు సి) ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా వినాయకుడిని ప్రతిష్ఠించి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించామని,శనివారం సాయంత్రం గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య తెలిపారు. ఈ నిమజ్జన వేడుకలలో టి జి డబ్ల్యు డబ్ల్యు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ అలీమ్,ధర్మాజీ సత్తన్న, జుంబర్తి గంగాధర్,కునారపు రమేష్,కరుణాకరణ్, మనోజ్, తిరుపతి, నరసయ్య, రాజన్న, సాయి నారాయణ, నవీన్ కుమార్, విజయ్, నరేష్, మణికంఠ, శ్రీనివాస్, సత్తన్న, నంబయ్య, రామన్న, శశి, రణధీర్, భినేష్, రాజేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుంభం ను కలిసిన మాందాపురం గ్రామ పంచాయతీ పాలకవర్గం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలోని మాందాపురం గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు ఆదివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని గ్రామ సర్పంచ్ దంతూరి యాదమ్మ ఆంజనేయులు గాడ్ సమక్షంలో మర్యాద పూర్వకంగా కలిసి ఊరిలో ఉన్న సమస్యల మీద చర్చించారు అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ స్తంభాలు మట్టి రోడ్డు, తప్పకుండా ఇస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోలిపురం ఉపేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కూసంగి రాములు, మాజీ సర్పంచ్ సోలిపురం సాగర్ రెడ్డి, ఉపసర్పంచ్ కూసంగి రాములు, బోయపల్లి మల్లారెడ్డి ,యాదిరెడ్డి , కుసంగి స్వామి,వార్డ్ మెంబర్ బద్దం ప్రభాకర్ రెడ్డి, కలకోటి అంజయ్య, పలుసం పద్మ, పల్లపు ప్రేమలత, ఈదయ్య కూసంగి రాధిక ,పలుసం శివ కుసంగి విజయ్, రామ్మూర్తి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతం తో వ్యక్తి మృతి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన ఏనుగుల ఐలయ్య (41) అను వ్యక్తి వ్యవసాయ బావి వద్ద మోటార్ కు కరెంటు రాకపోవడంతో, ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్ళి ఏబి స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు చేతి వేలకు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇట్టి విషయంపై మృతుని యొక్క కుమారుడు ఏనుగుల శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: పట్టణంలోని భువనగిరి చెరువును జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు ఆదివారం పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిమజ్జన ప్రాంతంలో భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమీషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

22ఏ భూములపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధపడాలి

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులు కూడా చర్చకు రావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందన్నారు. ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నాయకులు చర్చకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు. కెసీఆర్ కుటుంబ సభ్యులకు



8 జిల్లాలలో 400 ఎకరాల భూములు వున్నాయని, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూములు ఉంటే వాటిని గుర్తించి అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని రమేష్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలు, భూముల అంశాలపై వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే సూర్యాపేటలో జాబ్ మేళా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు జ్యోతి కరుణాకర్, పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, పాలగాని కృష్ణ, తండు శ్రీనివాస్ గౌడ్, ధర్మ నాయక్, బొప్పని శ్రీకాంత్,కరుణాకర్ రెడ్డి,కుంచం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దశదినకర్మల్లో పాల్గొన్న మండల కాంగ్రెస్ నాయకులు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలం నర్సాయగూడెం సర్పంచ్ పసల జ్యోతి విజయ్ అత్త దశదినకర్మలో వలిగొండ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు ఇటీవల సర్పంచ్ అత్త జెసింతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు.ఆమె దశదినకర్మ ఆదివారం నరసయ్య గూడెంలో జరిగాయి ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, వలిగొండ పిఏసిఎస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు రాపోలు సుదర్శన్, పడమటి దామోదర్ రెడ్డి, కాసుల వెంకన్న గౌడ్, గ్రంథాలయ చైర్మన్ సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి :వినాయక నవరాత్రి మహోత్సవాలు భువనగిరి పట్టణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ మండపంలో మరియు 23వ వార్డులోని మమ్మాయమ్మ గుడి, శివ గణేశ్, ఏకవీర, సాయి గణేష్, అరుంధతి,ఓంకార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలు భక్తులతో సందడిగా మారింది. మండప ప్రాంగణంలో 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.ముందుగా మండపంలో కొలువుదీరిన గణపతికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పరిసర వార్డులతో పాటు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి గణనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం అన్నం, తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆయా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు నాయకులు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొడవటంచ స్వామి ఆలయంలో శరవేగంగా అభివృద్ధి పనులు



భూపాల్ పల్లి ,ప్రజాస్ఫూర్తి:రేగొండ మండలం కోటంచ గ్రామంలోని కొడవటంచ స్వామి దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్మిస్తున్న కోనేరు పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులతో కలిసి పరిశీలించారు. కోనేరు నిర్మాణ ప్రణాళిక, పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొడవటంచ స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

ఎస్.కె. సాబీర్ పాషా

నైపుణ్య శిక్షణతోనే స్వీయం ఉపాధి

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : కొత్తగూడెం పట్టణంలో గల కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం ఏఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసుకున్న శిక్షణార్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా పాల్గొని ఆయన మాట్లాడుతూ మహిళలు నేర్చుకున్న వృత్తి నైపుణ్యాలను ఉపాధి మార్గాలుగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబం ఆనందంగా నడుస్తుందని



చేతివృత్తుల ద్వారా మహిళలకు ఉపాధి కల్పిస్తున్న నిర్వాహకుడు ఆదిల్ సేవలను ఆయన అభినందించారు. అనంతరం శిక్షణార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మేయర్ మూడ్ గణేష్, టిపిసిసి జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు, కాంగ్రెస్ జిల్లా నాయకులు అల్లాడి నరసింహారావు, శౌరి, గౌస్ పాషా, నిర్వాహకులు ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గిరిలో వైభవంగా జరిగిన శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవం

భువనగిరి, ప్రజాస్ఫూర్తి: కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ



హవనంను నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు.స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

*** అగ్నిమాపక భవనానికి శంకుస్థాపన**

భూపాలపల్లి,ప్రజా స్ఫూర్తి: భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన 27 మంది ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) లబ్ధిదారులకు రూ.37.64 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు, ఆసుపత్రుల్లో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వినాయక ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అన్నప్రసాదకార్యక్రమంలో



గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. అనంతరం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

*** అగ్నిమాపక భవనానికి శంకుస్థాపన**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వేశాలపల్లి పరిధి భాస్కర్‌గడ్డలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అగ్నిమాపక శాఖ భవనానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బంది తక్షణమే ఘటనాస్థలికి చేరుకునేలా జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోనూ అగ్నిమాపక సేవలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు శాశ్వత భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట,ప్రజాస్ఫూర్తి : గణేష్ నవరాత్రిఉత్సవాల సందర్భంగా చింతల్ డివిజన్ పరిధిలో ఉన్న భగత్ సింగ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 8 గణేష్ ఉత్సవ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కాలనీ సంక్షేమ సంఘం ఉప అధ్యక్షుడు బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బీసు వెంకటేశం గౌడ్ సందర్శించారు. అనంతరం వినాయకుడికి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అలిబిల్లి రవీందర్ రాము వర్ధన్ రమేష్ రామారావు ప్రవీణ్ బన్నీ. అల్లిబిల్లి విజయలక్ష్మి వనజా రెడ్డి జయ సంధ్యరాణి రాములమ్మ లక్ష్మి లావణ్య రాధికా రమ్య రమ్య లత సంధ్య కల్పనా యదా లక్ష్మి సువర్ణ పద్మ మహంకాళి అమ్మ తదితరులు హాజరయ్యారు.

23, 24, 25 తేదీల్లో తెలంగాణలో అతి భారీ వర్షాలు



హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న రోజుల్లో తీవ్ర వాయుగుండంగా మారనున్న నేపథ్యంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ 10 సెం.మీ.పైన వర్షాలు కురిసే అవకాశాలున్నాయంటూ ఈ జిల్లాలకు 'ఆరెంజ్' రంగు హెచ్చరికలు.. మిగిలిన జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని 'పసుపు' రంగు హెచ్చరికలు జారీ చేసింది. సోమ, మంగళవారాల్లో ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని సూచించింది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో శనివారం ఏర్పడిన అల్పపీడనం 22వ తేదీ నాటికి తీవ్ర వాయుగుండంగా మారనుంది. పశ్చిమవాయవ్య దిశలో ప్రయాణిస్తూ 23వ తేదీ ఉదయం నాటికి ఉత్తర ఆంధ్రప్రదేశ్‌దక్షిణ ఒడిశా తీరాల సమీపానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో 13.7 సెం.మీ నమోదైంది. ఇదే జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో 9.9, కోదేరు మండలంలో 8.4 సెం.మీ కురిసింది. సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, రంగారెడ్డి, జగిత్యాల, నారాయణపేట, వనపర్తి, ములుగు, ఖమ్మం జిల్లాల్లో పలుచోట్ల ఓమోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కాగా, కరీంనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం అరగంట పాటు వర్షం దంచికొట్టింది.

రెడ్డి, వెలమల సోపతి మాకొద్దు.. మా రాజ్యం మాకు కావాలి

* రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ మల్లన్న
* బీసీలను రాజకీయంగా అణగదొక్కుతున్నారంటూ తీన్మార్ మల్లన్న విమర్శలు
* కేసీఆర్, రేవంత్‌రెడ్డిలపై తీవ్ర ఆరోపణలు..



ప్రజాస్ఫూర్తి , షాద్‌నగర్ :రెడ్డి, వెలమ వర్గాల రాజకీయ ఆధిపత్యానికి చరమగీతం పాడి బీసీలకు రాజ్యాధికారం దక్కేలా పోరాటం చేస్తామని రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రెడ్డి, వెలమల సోపతి మాకొద్దు.. మా రాజ్యం మాకు కావాలని ఆయన స్పష్టం చేశారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వస్తున్న పార్టీలు బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న గోల్కొండ కోట నుంచి చేపట్టిన పాదయాత్ర ఆదివారం షాద్‌నగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర లో అడుగడుగునా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వెళ్తున్నారు. ఇదే క్రమంలో షాద్ నగర్ లోని బీసీ హాస్టల్ ను సందర్శించిన ఆయన విద్యార్థుల సమస్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ, మొల్ల, మహాత్మ జ్యోతిబా పూలే దంపతులకు, పండగ సాయన్న, పాపన్న గౌడ్, బసవేశ్వరా, గద్దర్, అబ్దుల్ కలాం తదితర మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ ముఖ్య కూడలిలో అంబేత్కర్ విగ్రహానికి నిర్వహించిన ఆయన అక్కడే రోడ్ షోలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అక్కడినుంచి పట్టణంలోని ఈడెన్ గార్డెన్ వద్ద భోజన విరామం తీసుకొని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు.

*** బీసీల ఓట్లు అడగకుండా పోటీ చేయాలి**

బీసీలను రాజకీయంగా దోచుకున్నారని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మల్లన్న విమర్శలు చేశారు. బీసీల ఓట్లు అడగకుండా ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బీసీల మద్దతు లేకుండా పోటీ చేస్తే ఆయా పార్టీలకు డిపాజిట్లు కూడా దక్కవని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌కు చెందిన పొలాలను పేదలకు పంచుతామని మల్లన్న ప్రకటించారు. స్థానిక యువతకు 70 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

*** రైతు భరోసా నిధులపై ప్రశ్నలు**

రైతు భరోసా కోసం ప్రభుత్వం రూ.9 వేల కోట్ల అప్పు చేసిందని, అందులో బీసీలకు రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని మల్లన్న ఆరోపించారు. బీసీల నెత్తిన రూ.5,580 కోట్ల అప్పు భారం పడిందని పేర్కొన్నారు. అదే సమయంలో ఓసీలకు రైతు భరోసా కింద రూ.3,983 కోట్లు ఇవ్వగా, వారి నెత్తిన పడిన అప్పు భారం రూ.720 కోట్లు మాత్రమేనని అన్నారు. ఈ లెక్కలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'కత్తెర' గుర్తుతో పోరాటం

తమ పార్టీ ఎన్నికల గుర్తు 'కత్తెర' అని తీన్మార్ మల్లన్న తెలిపారు. కత్తెర గుర్తుతో రెండు ప్రధాన రాజకీయ పార్టీల తోకలు కత్తిరిస్తామని ఆయన వ్యాఖ్యానించారు. బీసీలకు రాజకీయ అధికారం దక్కే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రెడ్డి, వెలమ వర్గాల మధ్య జరుగుతున్న రాజకీయ పోరాటంలో బీసీలు బలవుతున్నారని మల్లన్న అన్నారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ రాజకీయంగా విభేదాలు బయటపెట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈ వివాదాల్లో అప్పుడప్పుడు బీసీ ఎమ్మెల్యేలను కూడా లాగుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఉద్దేశించి "శంకర్ అన్న.. సర్వే బాగాలేదు.. కొంచెం చూసుకో.. మోసపోకు" అంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ యాదవ్ పేరును కూడా ప్రస్తావిస్తూ తనదైన శైలిలో రాజకీయ విమర్శలు చేశారు. షాద్‌నగర్ పాదయాత్ర సందర్భంగా స్థానికంగా అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని మల్లన్న తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గం అధ్యక్షులు ఎమ్మె సంతోష్, జిల్లా అధ్యక్షులు రమేష్ యాదవ్, ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, దర్గా వెంకటయ్య, రాములు, యాదయ్య, రాజు, నవీన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురువు స్థానాన్ని ఏఐ లాంటివి భర్తీ చేయలేవు

* లయన్ రాజేంద్ర ప్రసాద్
* లయన్ 320 బి డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయదినోత్సవ వేడుకలు
* 100 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు




(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : ఏఐ లాంటి సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికి గురువుకు ఉన్నటువంటి ఉన్నతమైన స్థానాన్ని భర్తీ చేయలేదని లయన్స్ క్లబ్ అఫ్ ఇంటర్నేషనల్ 320 జోనల్ తాజా మాజీ చైర్మన్ లయన్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ 320 బి డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని లయన్స్ భవన్ లో ఉపాధ్యాయదినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్ రామేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి గుర్తించిన 100 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. గురువు ఎప్పుడు కూడా తన స్థానం తగ్గిందని భావించొద్దాన్నారు. కినోట్ స్పీకర్ 320 బి మాజీ గవర్నర్ విజయకుమార్ శెట్టి మాట్లాడుతూ గురువు స్థానం అనేది పురాణాల్లో ఉన్నాదని గుర్తు చేశారు. శ్రీకృష్ణుడు విశ్వ గురువుగా ప్రఖ్యాతి పొందారన్నారు. ఆయన అంశల పుట్టారో ఏమోకాని సర్వేపల్లి రాదాకృష్ణ కృష్ణుడి పేరుతో నేటి కాలానికి గురువుగా మారారాని కొనియాడారు. కార్యక్రమంలో 320 బి మాజీ గవర్నర్ విద్యాసాగర్ రెడ్డి , ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతి రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మధుమిత, బిర్రు ఆంజనేయులు, వినోద్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. తెలంగాణ బహుజనుల బాణాన్ని: కవిత

కొడంగల్: "కాంగ్రెస్ విడిచిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు.. కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు.. భాజపా బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న తెలంగాణ బహుజనుల బాణాన్ని నేను. తెలంగాణ యువజనుల యుద్ధ నినాదాన్ని.. అంబేడ్కర్ వాదాన్ని.. మహాత్మ జ్యోతిబా పులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను. మీరు ధైర్యమిస్తే.. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడుతుందని నిరూపించడానికే ఇక్కడికి వచ్చా" అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత మాట్లాడారు. "దేశంలో పరిస్థితి ఎలా ఉందంటే.. మహిళలు మహరాణులు అంటారు. కానీ, వంటింట్లో గిన్నెల మీద మగవాళ్ల పేర్లే ఉంటాయి. 29 రాష్ట్రాలున్న ఈ దేశంలో ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉంది. చరిత్ర తిరగరాద్దామా? తెలంగాణలో మాతృస్వామ్య వ్యవస్థ తెచ్చుకుందామా? ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్థాన్‌తో సమానంగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు. ప్రజలకు ఏం సమాధానం చెబుతారు" అని కవిత ప్రశ్నించారు.

ప్రొటీన్లతో అలసట మాయం!

ఉదయాన్నే నిద్ర లేచింది మొదలు.. ఊపిరి సలపని పనులతో క్షణం తీరిక ఉండదు. మరోవైపు ఆఫీసులో ఒత్తిడి, అలసటతో సతమతమవుతాం. ఇలాంటి బిజీ లైఫ్‌స్టైల్‌తో ఎదురయ్యే అలసటను దూరం చేసుకొని చురుగ్గా మారాలంటే ప్రొటీన్లు నిండిన ఆహార పదార్థాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతున్నారు నిపుణులు.





నట్స్

ప్రొటీన్లతో నిండిన బాదంపప్పు, పిస్తా, అక్రోట్.. వంటి గింజలను ప్రతిరోజూ మితంగా తీసుకోవడం మంచిది. అవి గుండెకు మేలు చేస్తాయట. సలాడ్లు, ఉడికించిన కూరగాయలతో కూడా వీటిని కలుపుకొని తినొచ్చు. అయితే నట్స్‌లో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

పాలు, పాల పదార్థాలు

కండరాల నిర్మాణానికి తోడ్పడే ప్రొటీన్లు పాలు, పాల పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తపోటు అదుపులో ఉంచడానికీ తోడ్పడతాయట. ఈ క్రమంలో తక్కువ కొవ్వులుండే పాల పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

సోయాబీన్స్

సోయాబీన్స్‌లో ప్రొటీన్ల మోతాదు ఎక్కువ. వీటిని సోయా పాలు, సోయా పేస్ట్, టోఫూ రూపంలోనూ తీసుకోవచ్చు. అయితే ఇవి కొంతమందికి పడకపోవచ్చు. అలాంటి వారు వీటిని తీసుకునే విషయంలో వైద్యులను సంప్రదించాలి.



ఇవి కూడా!

* బఠాణీలు, రాజ్మా, బీన్స్, చిక్కుళ్లు, ఇతర కూరగాయల్లోనూ ప్రొటీన్ ఉంటుంది.
* చేపల్లో ప్రొటీన్లతో పాటు గుండెకు మేలు చేసే ఒమేగా3 కొవ్వు ఆమ్లాలూ ఎక్కువగానే ఉంటాయి.
* మాంసాహారంలోనూ ప్రొటీన్లు మెండుగా ఉంటాయి. అయితే వీటిలో కొవ్వులు కూడా ఎక్కువగా ఉంటాయి కాబట్టి మితంగానే తీసుకోవాలంటున్నారు నిపుణులు.
* కోడిగుడ్డులో కూడా ప్రొటీన్ ఉంటుంది. కానీ కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్న వారు, గుండెజబ్బులు.. వంటి సమస్యలున్న వారు డాక్టర్ సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఆహారంలో చేర్చుకోవాలి.

పోషకాల ఖర్జూరాలు.. అందుకే ఎంతో మేలు!

రంజాన్ మాసంలో ఆచరించే కఠిన ఉపవాస దీక్షకు అత్యంత ప్రాధాన్యం ఉంది. రోజూ ఈ దీక్ష విరమించేటప్పుడు తీసుకునే ఆహార పదార్థాల్లో 'ఖర్జూరాలు' తప్పకుండా ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తినిచ్చే ఈ పండు ఆరోగ్యపరంగానూ ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు.

* పొటాషియం ఎక్కువగా లభించే ఖర్జూరాలు తినడం వల్ల గుండె కొట్టుకునే రేటు, రక్తపోటు అదుపులో ఉంటాయట. అలాగే గుండె సంబంధిత సమస్యలు దరిచేరకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు నిపుణులు.
* ఖర్జూరం పండ్లలో శరీరానికి కావాల్సిన ఖనిజాలు, విటమిన్లు, ఇతర పోషకాలు అధికంగా ఉంటాయట. ఇవి సంపూర్ణ ఆరోగ్యానికి చాలా అవసరం.
* ఖర్జూరాల్లో కొలెస్ట్రాల్ తక్కువగా.. ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. కాబట్టి ఇవి తింటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగి.. బరువు అదుపులో ఉంచుకోవచ్చు.
* క్యాల్షియం, మెగ్నీషియం, కాపర్.. వంటి ఖనిజాలు ఈ పండులో అధికంగా లభిస్తాయి. క్యాల్షియం ఎముకలను, దంతాలను దృఢంగా ఉంచడానికి.. కాపర్ ఎర్రరక్తకణాల ఉత్పత్తికి.. మెగ్నీషియం ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడతాయి.
* ఖర్జూరాలు కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాదు.. బాగా సన్నగా ఉండి బరువు పెరగాలనుకునే వారికీ మంచి ఫలితాన్నిస్తాయంటున్నారు నిపుణులు.
* ఖర్జూరం పండు శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. అందుకే రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో ఈ పండుని ఆహారంగా తీసుకుంటారు.
* మలబద్ధకంతో బాధపడేవారు కొన్ని ఖర్జూరాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడుపున వాటిని తిని, ఆ నీరు తాగితే మంచి ఫలితం ఉంటుందట.
* ఖర్జూరంలో ఉండే వివిధ పోషకాలు శరీరంలోని జీవక్రియలను వేగవంతం చేయడంలో సహకరిస్తాయి.
* ఖర్జూరాల్లో ఉండే విటమిన్ 'బి6' వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందట.







బాలాపూర్ గణనాథుడిని టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు విజయ్‌కి లడ్డూ ప్రసాదం అందజేసి, ఆశీర్వదించారు .

డైరెక్ట్‌గా ఓటీటీలోకి మృణాల్ ఠాకూర్ మూవీ

మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ మూవీ పూజా మేరీ జాన్ షూటింగ్ పూర్తయిన నాలుగేళ్ల తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తోంది. థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో రిలీజ్ అవుతోంది. పూజా మేరీ జాన్‌లో మృణాల్ ఠాకూర్‌తో పాటు టాక్సిక్ ఫేమ్ హ్యుమా ఖురేషి హీరోయిన్లుగా నటించగా...విజయ్ రాజ్, విక్రామ్ సింగ్ చౌహాన్ కీలక పాత్రలు పోషించారు. ఈ బాలీవుడ్ మూవీకి నవ్‌జోత్ గులాటీ దర్శకత్వం వహించాడు. పూజా మేరీ జాన్ షూటింగ్ 2022లో పూర్తయ్యింది. అక్టోబర్ 2న జీ5 ఓటీటీలో విడుదల అవుతోంది. హిందీతో పాటు తెలుగులోనూ అందుబాటులోకి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. సినిమా రిలీజ్ డేట్‌ను వెల్లడిస్తూ జీ5 ఓటీటీ ఓ పోస్ట్ పెట్టింది. కొన్ని కథలు మనం చూసేది నిజమేనా అనే అనుమానం రేకెత్తిస్తాయి. మరికొన్ని మనం నమ్మేది నిజమేనా అని అనుకునేలా చేస్తాయి. ఈ కథ ఆ రెండింటి మధ్య ఉన్న ప్రతి ఒక్క విషయాన్నీ ప్రశ్నించేలా ఉంటుంది అని ఈ పోస్ట్‌లో పేర్కొన్నది.



ఓజీ హీరోయిన్‌తో మాస్ మహారాజా రొమాన్స్

ఇరుముడితో మళ్లీ విజయాల బాట పట్టాడు మాస్ మహారాజా రవితేజ. శివనిర్వాణ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ మూడు వందల కోట్లకుపైగా వసూళ్లను దక్కించుకుంది. రవితేజ కెరీర్‌లోనే కాకుండా ఈ ఏడాది టాలీవుడ్‌లో హయ్యెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా నిలిచింది. రవితేజ కెరీర్‌లో ఫస్ట్ హారర్ మూవీగా రాబోతున్న సినిమాలో ఓజీ బ్యూటీ ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటించనున్నట్లు సమాచారం. ఇరుముడిలో కోలీవుడ్ బ్యూటీ ప్రియా భవానీ శంకర్ కథానాయికగా కనిపించింది. తమిళ హీరోయిన్ సెంటిమెంట్ బాగా కలిసివచ్చింది. దాంతో వివేక్ ఆత్రేయ సినిమాలోనూ ఈ సెంటిమెంట్‌ను కంటిన్యూ చేయాలని మేకర్స్ ఫిక్సైనట్లు సమాచారం. అందుకే ప్రియాంక మోహన్‌ను హీరోయిన్‌గా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివేక్ ఆత్రేయ గత సినిమా సరిపోదా శనివారంలో కూడా ప్రియాంకనే హీరోయిన్‌గా కనిపించింది.




డైరెక్టర్ వేధింపులపై కోర్టును ఆశ్రయించిన మంజు వారియర్



సోషల్ మీడియా వేధింపులపై మలయాళ హీరోయిన్ మంజు వారియర్ కోర్టును ఆశ్రయించారు. అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సనల్ కుమార్ తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దర్శకుడిపై పరువు నష్టం దావా వేసింది. గత ఆరేళ్లుగా సనల్ కుమార్ తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని మంజు పేర్కొన్నది. తన వ్యక్తిత్వాన్ని వక్రీకరించేలా సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్ట్‌లు, ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేస్తున్నాడని అన్నది. సోషల్ మీడియాల నుంచి ఈ పోస్ట్‌లను తొలగించడమే కాకుండా తనపై అసత్యపు ప్రచారాలను చేస్తోన్న సనల్ కుమార్‌తో పాటు అతడి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎర్నాకులం కోర్టును ఆశ్రయించింది మంజు వారియర్. మంజు వారియర్ పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు సనల్ కుమార్‌తో పాటు ఫేస్‌బుక్‌కు సమన్లు జారీ చేసింది.

గుడ్‌బాయ్స్ ఫస్ట్ లుక్

పటాస్ మూవీతో హీరోయిన్‌గా టాలీవుడ్‌కు పరిచయమైన శృతి సోధి కమెడియన్ వెన్నెలకిషోర్‌తో ఓ సినిమా చేయబోతుంది. ఈ సినిమాకు గుడ్‌బాయ్స్ అనే పేరును ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో వెన్నెలకిషోర్ ఛైర్‌లో కూర్చొని ఉండగా... అతడి చుట్టూ వివిధ గెటప్‌లలో వైవా హర్ష, శృతి సోధి, రవి రాజా, గుండు సుదర్శన్ కనిపిస్తున్నారు. వీళ్లు హీరోలు కాదు.. అసలు హీరోలకు దగ్గరగా కూడా రారు. కానీ విలన్లను ఎదుర్కొనేంత పిచ్చి ఉన్నవాళ్లు మాత్రం వీళ్లే' అంటూ పోస్టర్‌కు మేకర్స్ ఓ ట్యాగ్‌లైన్ ఇచ్చారు.ఈ ట్యాగ్‌లైన్ ఆసక్తిని పంచుతోంది. ఈ సినిమాలో శృతి సోధి ఫన్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నట్లు సమాచారం. గ్యాంగ్‌కు లీడర్‌గా వెన్నెల కిషోర్ యాక్టింగ్, అతడి కామెడీ టైమింగ్ సినిమాకు హైలైట్‌గా నిలవబోతున్నట్లు చెబుతున్నారు. ఈ సినిమాకు రాఘవ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.